
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట 5
గురువారం 20 మార్చి 2025



చిరుత పాదముద్రల పరిశీలన



రాయపోల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధి తిమ్మక్కపల్లిలోని పొలాల వద్ద చిరుత సంచారం చేస్తుందన్న సమాచారం మేరకు అటవీ శాఖ అధికారులు కదిలారు. బుధవారం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సందీప్‌కుమార్, సెక్షన్ ఆఫీసర్ హైమద్ హుస్సేన్ ఆ ప్రాంతాన్ని సందర్శించి చిరుత పాదముద్రలను పరిశీలించారు. రైతులు ఒంటరిగా పొలాల వద్దకు వెళ్లకూడదని, పశువులను ఇంటివద్దనే కట్టేసుకోవాలని సూచించారు. చిరుత సంచరించిన ప్రాంతంలో ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

బీసీ, ఎస్సీల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాట నిలబెట్టుకుంది

సంగారెడ్డిలో సంబరాల్లో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి



సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, దామోదర్ రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నిర్మలా జగ్గారెడ్డి తదితరులు

సంగారెడ్డి టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాహుల్‌గాంధీ ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ సారథ్యంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు, ఎస్సీ వర్గీకరణకు బిల్లుకు శాసన సభ ఆమోదం తెలుపడంపై సంగారెడ్డి పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం సంబరాలు నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రిజర్వేషన్ కమిటీ చైర్మన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, దామోదర్ రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా సామాజికంగా లబ్ధి పొందుతారని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదించడం ద్వారా దశాబ్దాల కల నెరవేరిందన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకొనే పార్టీ కాంగ్రెస్ అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా చెయ్యని పని కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందని ప్రజలు గమనించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ తోపాజీ అనంతకిషన్, పట్టణ అధ్యక్షుడు జార్జ్, కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్, కిరణ్‌గౌడ్, షఫీ, బబ్బు, వెంకట్ రాజు, కసినిరాజు, చిత్తారి యాదగిరి, నర్సింహులు, ప్రదీప్, నవాజ్, బండి నర్సింహులు, సతీష్‌రెడ్డి, శ్రీశైలం, బాలు యాదవ్, వెంకట్, ఆరీఫ్, తాహేర్ పాషా, కుతుబ్, జహీర్, కసిని విక్రాంత్, కిట్టు తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు పటిష్ట బందోబస్తు

● సీపీ అనురాధ



సిద్దిపేట కల్చరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రేపటి నుంచి ప్రారంభమయ్యే పదోతరగతి పరీక్షలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీపీ అనురాధ తెలిపారు. జిల్లాలోని 79 పరీక్షా కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ విధిస్తున్నామని చెప్పారు. ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 4వరకు పరీక్ష జరిగే ప్రతీ రోజు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. కేంద్రాల సమీపంలోని అన్ని జిరాక్స్ సెంటర్స్ మూసి వేయాలని, 500 మీటర్ల వరకు ఐదుగురు కానీ అంతకంటే ఎక్కువ మంది గుమికూడవద్దన్నారు. పరీక్షల సమయంలో పెట్రోలింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. విద్యార్థినీవిద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పరీక్ష సమయానికి గంట ముందే కేంద్రానికి చేరుకోవాలన్నారు. మానసికంగా ఎటువంటి ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:33 (గురువారం సాయంత్రం) సహర్: 4:58 (శుక్రవారం ఉదయం)

బాబోయ్.. ఎండలు

భానుడి ప్రతాపానికి జనం విలవిల

దిగ్వాల్‌లో 40.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు



సంగారెడ్డి బాలికల ఉన్నత పాఠశాల నుంచి హాస్టల్‌కు వెళుతున్న క్రమంలో ఎండ నుంచి రక్షణ కోసం చున్నీలను తలపై కప్పుకుని వెలుతున్న విద్యార్థినులు
- స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి జిల్లా

కోహీర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజలు భానుడి ప్రతాపానికి ప్రజలు విలవిలలాడుతున్నారు. ఎండ తీవ్రతకు ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎండ తీవ్రతకు అధికమవడంతో రైతులు, కూలీలు పొలాలకు వెళ్లడానికి భయపడుతున్నారు. పది రోజులుగా ఎండలు పెరగడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. ఉదయం 9 గంటలకు మొదలైన ఎండ సాయంత్రం 6 గంటలయినా తగ్గడం లేదు. రెండు రోజుల్లో రాష్ట్రంలో వడగళ్ల వర్షాలు కురుస్తాయని భారత వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో ఎండల నుంచి ఉపశమనం లభించవచ్చని ప్రజలు భావిస్తున్నారు.

బుధవారం నమోదైన ఉష్ణోగ్రతలు

సంగారెడ్డి జిల్లా దిగ్వాల్‌లో 40.1 డిగ్రీలు, చౌటకూర్ 39.1 సత్వార్ 39.9, నారాయణఖేడ్ 39.8, పల్వట్ల 39.8, సదాశివపేట 39.7, వట్‌పల్లి 39.7, ముక్తాపూర్ 39.7, గుండ్లమాచునూరు 39.6, సుల్తాన్‌పూర్ 39.6, అల్లోల్ 39.5, మొగుడంపల్లి 39.5, హత్నూర 39.5, అల్మాయిపేట్ 39.5, జిన్నారం 39.4, పాశమైలారం 39.4, జహీరాబాద్ 39.4, గుమ్మడిదల 39.3 బీహెచ్ఈఎల్ 39.3, మల్‌చెల్మ 39.3, పుల్కల్ 39.2, కడ్పల్ 9.2, కంది 39.2, లక్ష్మీసాగర్ 39.1, రుద్రారం 39.0 ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మెదక్ జిల్లాలో

కాగజ్‌మద్దూర్‌లో 39.9 డిగ్రీలు, దామరంచ 39.8, నాగపూర్ 39.8, పాతూర్ 39.7 నర్సాపూర్ 39.7, రాజ్‌పల్లి 39.5, కొడిపల్లి 39.5, రేగోడ్ 39.4, చిప్పల్‌తుర్తి 39.4, కొత్తపేట 39.4, శివ్వంపేట 39.4, బోడఘాట్ 39.3, అల్లాదుర్గం 39.3, శంకరంపేట్(ఆర్) 39.3, పోచంపల్లి 39.2, లక్ష్మాపూర్‌లో 39.0 ఉష్ణోగ్రత నమోదైంది.

సిద్దిపేట జిల్లాలో

తుక్కాపూర్ 39.8, చికోడ్ 39.8, దౌల్తాబాద్ 39.7, హుస్నాబాద్ 39.5, బెజ్జంకి 39.4, సిద్దిపేట 39.3, రేబర్తి 39.2, గౌరారం 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.



నిర్మానుష్యంగా మారిన కోహీర్ గ్రామం

ఈసారీ నిరాశే..

● రాష్ట్ర బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు దక్కని కొత్త ప్రాజెక్టులు ● ప్రస్తావనకు రాని మెతుకుసీమ సమస్యలు



సంక్షేమ పథకాలకు పెద్దపీట వేసిన భట్టి విక్రమార్క

నీటిపారుదల శాఖకు 23,373 కోట్ల కేటాయింపుతో ఆశలు

సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులు, కొత్త కాలువలకు నిధులొచ్చేనా?

వ్యవసాయం, వైద్యారోగ్యశాఖకు ప్రాధాన్యత.. మున్సిపాలిటీల అభివృద్ధిపై దృష్టి

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ బడ్జెట్ నివేదికలో ఎక్కడా ఉమ్మడి మెదక్ జిల్లా పేరు ప్రస్తావనకు రాకపోవడం గమనార్హం. కొత్త ప్రాజెక్టుల మంజూరు సంగతి పక్కనబెడితే బడ్జెట్‌లో సంక్షేమ రంగాలకు ప్రాధాన్యత ఇచ్చినట్లుగా కనిపిస్తోంది. సంక్షేమంతోపాటు వైద్యారోగ్య, రోడ్లు, భవనాలు, వ్యవసాయం, సాగునీటి, పురపాలక రంగాలకు అత్యధిక నిధులు కేటాయించిన నేపథ్యంలో మెతుకుసీమకు కూడా ప్రయోజనం కలుగుతుందనే ఆశలు నెలకొన్నాయి. అయితే సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు ఏ స్థాయిలో కేటాయింపులు ఉంటాయో వేచి చూడాల్సిందే.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మార్చి 19: సంగారెడ్డి జిల్లాలో సంగమేశ్వర, బసవేశ్వర సాగునీటి ప్రాజెక్టుల గురించి బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. అదే విధంగా కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి రిజర్వాయర్లకు అనుసంధానంగా కాలువల నిర్మాణం, భూనిర్వాసితుల పరిహారం గురించి కూడా పేర్కొనలేదు. జహీరాబాద్ ప్రాంతంలో ట్రైడెంట్ చక్కెర ఫ్యాక్టరీ పునరుద్దరణ విషయాన్ని మరచినట్లున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా గృహప్రవేశాలకు సిద్దంగా ఉన్న దాదాపు 3వేల డబుల్ బెడ్రూం ఇళ్ల విషయం ప్రస్తావనకు రాలేదు. అదే విధంగా సిద్దిపేట జిల్లాలోని చేర్యాల, దుబ్బాక, మెదక్ జిల్లాలోని రామాయంపేట, సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరు కేంద్రాలను రెవెన్యూ డివిజన్లుగా మార్చాలనే ప్రతిపాదనలకు చోటు దక్కలేదు. ప్రధానంగా మెతుకుసీమ దశ, దిశను మార్చేవిధంగా కొత్త ప్రాజెక్టులు, అభివృద్ధి కార్యక్రమాల గురించి పేర్కొనకపోవడం నిరాశను కలిగిస్తోంది.

వైద్యారోగ్యం, వ్యవసాయం, పురపాలనకు నిధులు

వైద్యారోగ్య శాఖకు రూ.12,393 కోట్లు కేటాయించడం కొంత ఊరట కలిగించే విషయమే. మెదక్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలకు సొంత భవనంతో పాటు అనుబంధ ఆసుపత్రిని ఏర్పాటు చేయాల్సి ఉంది. సంగారెడ్డి ప్రభుత్వ మెడికల్ కళాశాల, ఆసుపత్రికి సైతం నిధులు అవసరం ఉన్నాయి. అదేవిధంగా సిద్దిపేటలో వెయ్యి పడకల ప్రభుత్వ ఆసుపత్రిని 90శాతం మేర నిర్మించినప్పటికీ తుదిదశ పనులు చేపట్టకపోవడంతో ప్రారంభించలేదు. కూడా నిధులు కేటాయిస్తే ఇక్కడ నిరుపేదలకు ఆసుపత్రి అందుబాటులోకి వస్తుంది.

వ్యవసాయశాఖకు అత్యధికంగా రూ.24,439 కోట్లు కేటాయించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో రుణమాఫీ జరగని రైతులకు తీపి కబురు అందనున్నది. వానాకాలం రైతుభరోసా, సన్నవడ్లకు బోనస్ రూపంలోనూ ఈ నిధులు రైతుల ఖాతాల్లో చేరనున్నాయి. అంతేగాకుండా కొత్తగా ఏర్పాటైన మున్సిపాలిటీలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఉమ్మడి జిల్లాలో కోహీర్, గడ్డపోతారం, గుమ్మడిదల, ఇస్నాపూర్ మున్సిపాలిటీలను ఇటీవల ఏర్పాటు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కొత్త పట్టణాలకు రూ.4500 కోట్లు కేటాయించారు. ఇక ఇతర మున్సిపాలిటీలకు రూ.17,677 కోట్లు కేటాయించగా ఉమ్మడి జిల్లాలోని సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాల, రామాయంపేట, మెదక్, తూప్రాన్, మెదక్, నర్సాపూర్, సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్, నారాయణఖేడ్, అందోల్-జోగిపేట, అమీన్‌పూర్, తెల్లాపూర్, ఐడీఏ బొల్లారం మున్సిపాలిటీలకూ ప్రయోజనం చేకూరనున్నది.

రూ.23వేల కోట్లలో మనకెంత?

ఉమ్మడి మెదక్ జిల్లాను ప్రధానంగా వేధిస్తున్న సమస్య సరిపడా సాగునీరు లేకపోవడమే. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్, గౌరవెల్లి రిజర్వాయర్లను నిర్మించారు. కానీ వీటికి అనుసంధానంగా కాలువలను నిర్మించలేదు. ఈ కాలువల నిర్మాణం పూర్తయితే సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్ నియోజకవర్గాలు సస్యశ్యామలమవుతాయి. మెదక్, నర్సాపూర్‌లకు ప్రయోజనం చేకూరుతుంది. సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులను నిర్మిస్తే జహీరాబాద్, నారాయణఖేడ్, సంగారెడ్డి, అందోల్ నియోజకవర్గాల దశ మారుతుంది. అయితే రాష్ట్ర బడ్జెట్‌లో రూ.23,373 కోట్ల రూపాయలను నీటిపారుదల శాఖకు కేటాయించారు. ఇందులో ఉమ్మడి మెదక్ జిల్లాకు తగినంత నిధులు కేటాయిస్తేనే సాగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

సంక్షేమ రంగాలకు పుష్కలంగా నిధులు

రాష్ట్ర బడ్జెట్‌లో ప్రధానంగా బీసీ,ఎస్సీ,ఎస్టీ వర్గాలకు పెద్దపీట వేశారు. దీంతో మెతుకుసీమలోని దాదాపు 80 శాతం ప్రజలకు అనేక రకాల ప్రయోజనాలు దక్కనున్నాయి. స్వయం ఉపాధి కోసం రుణాలతోపాటు సామాజిక వర్గాల పరంగా ఏర్పాటు చేసిన గురుకులాలకూ ఈ నిధులు చెందుతాయి. ఎస్సీలకు రూ.40,232 కోట్లు, ఎస్టీలకు రూ.17,169 కోట్లు, బీసీలకు రూ.11,405 కోట్లు కేటాయించడంతో ఆ వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా పెద్ద ఎత్తున నిధులు కేటాయించారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

బడ్జెట్‌పై భినాభిప్రాయాలు 7లో

కూడవెల్లి వాగుకు జలకళ



తొగుట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధి చందాపూర్ గ్రామ శివారులోని కూడవెల్లి వాగులోకి అధికారులు నీటిని విడుదల చేశారు. దీంతో బుధవారం మత్తడి దూకి వాగు పొంగి పొర్లింది. నిండు వేసవిలో వాగు జలకలను సంతరించుకోవడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేశారు.



చేర్యాల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి కత్తుల వెంకట్‌రెడ్డి నాలుగు ఎకరాల్లో వరి సాగుచేశాడు. రెండు బోర్లు ఉండగా, ఒక్కబోరు మాత్రమే సన్నటిధార పోస్తుంది. ఇటీవల వేసిన మూడుబోర్లలోనూ చుక్క నీరు రాలేదు. కనీసం తినడానికైనా ఒక్క మడినైనా కాపాడుకుందామని నిత్యం రెండు ట్యాంకర్ల నీటిని కొనుగోలు చేస్తూ నీరు అందిస్తున్నారు.

దరిచేరని భృతి

● బీడీ కార్మికులకు అందని జీవనభృతి
● కటాఫ్ నిబంధనతో వేలాదిమంది దూరం
● నెరవేరని ఎన్నికల హామీలు

దుబ్బాక, మార్చి19(ఆంధ్రజ్యోతి) : బీడీ కార్మికులను ఆర్థిక కష్టాలు వెంటాడుతున్నాయి. ఒకప్పుడు చేతి నిండా పని లభించి, బుక్కెడు బువ్వపెట్టిన బీడీల వృత్తి ఇప్పుడు ఆదరణకు నోచుకోక, ప్రభుత్వం ప్రోత్సాహం అందక దానిపై ఆధారపడిన కార్మికుల బతుకులు ఆగమవుతున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలోని సగం గ్రామాలు దీన్నే నమ్ముకుని బతుకుతున్నాయి. ఈ నేపథ్యంలో బీడీ కార్మికుల పరిస్థితి ఇప్పుడు అయోమయంలో పడింది.

2014 కంటే ముందు వారికే భృతి..

బీడీ కార్మికులను ఆదుకోవాలనే సదుద్దేశంతో గత ప్రభుత్వం జీవనభృతి అందించింది. తగినంత పనిదినాలు.. సరైన వేతనాన్ని అందించలేని బీడీ పరిశ్రమల యాజమాన్యంపై ఒత్తిడి తేలేని పరిస్థితిలో 2014 కంటే ముందు పీఎఫ్ ఉన్న బీడీ కార్మికులకు జీవనభృతిని మంజూరు చేసింది. దీంతో జిల్లాలోని సుమారు 44,473 మంది బీడీ కార్మికులు, 276 మంది టేకేదారులు లబ్ధి పొందుతున్నారు. కాగా, జిల్లాలో ప్రస్తుతం



సుమారు 72వేల మంది పీఎఫ్, నాన్ పీఎఫ్ కార్మికులు ఉన్నారు.

కటాఫ్ తేదీతో..

కటాఫ్ తేదితో చాలామంది కార్మికులు జీవనభృతికి దూరమయ్యారు. కటాఫ్‌తేది నిబంధనలు ఎత్తివేయాలని పలు కార్మిక సంఘాలు జిల్లాతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా గత ఐదేండ్ల నుంచి ఉద్యమిస్తూనే ఉన్నాయి. గత ప్రభుత్వం 2014 ఫిబ్రవరి 28 కంటే ముందు పీఎఫ్ ఉన్న కార్మికులకు మాత్రమే జీవనభృతిని అందించింది. అప్పటికే నాన్‌పీఎఫ్ కార్మికులు సుమారు 27 వేల మంది ఉండగా, ప్రస్తుతం మరో 25వేల మంది వరకు పెరిగి ఉంటారు. ఇక పీఎఫ్ ఉన్న మొత్తం బీడీ కార్మికులు సుమారు 70 వేలకు పైగా ఉంటారు. కనీసం జీవన భృతితోనైనా తమకు కొంత ఆసరాగా ఉంటుందని భావించిన కార్మికులు పీఎఫ్ కోసం నానా ఇబ్బందులుపడి చివరకు పొందారు. తీరా ప్రభుత్వం దశాబ్దకాలం పాటు వారిని పరిగణలోకి తీసుకోకపోవడంతో జీవన భృతికి దూరమై ఆర్థికంగా తీవ్ర అవస్థలు పడుతున్నారు.

నెరవేరని హామీలు

బీడీ కార్మికుల జీవభృతి కోసం కటాఫ్‌తేది నిబంధనను తొలగించాలని బీడీ కార్మిక సంఘాలు డిమాండ్ చేయడంతో 2020లో జరిగిన దుబ్బాక అసెంబ్లీ ఉప ఎన్నికల్లో ఆదే ప్రధాన డిమాండ్‌గా మారింది. సంస్థలు సంక్షోభంలో ఉన్నాయన్న కారణంతో కార్మికులకు అందించాల్సిన

- మిగతా 8వ పేజీలో...

నిషేధిత అల్ప్రాజోలం స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అధికారులు

హత్నూర, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఓ ఇంటిపై దాడిచేసి నిషేధిత అల్ప్రాజోలంను స్వాధీనం చేసుకున్న సంఘటన హత్నూర మండలం దౌల్తాబాద్ బస్టాండ్ సమీపంలోని ఓ ఇంట్లో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. దౌల్తాబాద్ బస్టాండ్ సమీపంలోని కాసాల గ్రామ శివారులో ఓ ఇంటిపై మంగళవారం రాత్రి ప్రొఫెషనల్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ (మెదక్ డివిజన్) ఏఈఎస్‌కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో దాడి చేసినట్లు అధికారులు తెలిపారు. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం నాగులపల్లి గ్రామానికి చెందిన రాజాగౌడ్, సిద్దిపేట ప్రాంతానికి చెందిన చిత్తాపూర్ గ్రామానికి చెందిన నర్సాగౌడ్ ఇద్దరూ నిషేధిత అల్ప్రాజోలం 503 గ్రాములు, డయజోఫామ్ 17 గ్రాములు ఇంట్లో ప్లాస్టిక్ కవర్లలో నింపుతున్న క్రమంలో నమ్మదగిన సమాచారం మేరకు దాడిచేసి పట్టుకున్నామన్నారు. వీటి విలువ సుమారు రూ.5.20 లక్షలు ఉంటుందన్నారు. వీటితో పాటు రెండు ఫోన్లను స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అదుపులోకి తీసుకుని అందోల్ ఎక్సైజ్ సీఐకి అప్పగించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఈ దాడిలో ఏఈఎస్ శ్రీనివాసరావు, ఇతర ఎక్సైజ్ అధికారులు వీణారెడ్డి, చంద్రశేఖర్, గాంధీనాయక్, అనిల్‌కుమార్, యాదయ్య, ఖరీం, సతీష్, మోహన్, ప్రహల్లాద్‌రెడ్డి, వివేక్ పాల్గొన్నారు.

బొలెరో, లారీ ఢీ.. ఒకరు మృతి

నారాయణఖేడ్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ఎదురెదురుగా వస్తున్న బొలెరో, లారీ ఢీకొనడంతో ఒకరు మృతిచెందిన సంఘటన సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్-నిజాంపేట 161బీ జాతీయ రహదారిపై ర్యాలమడుగు సమీపంలో బుధవారం చోటు చేసుకున్నది. కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన బొలెరో వాహనం మందులను సరఫరా చేసి తిరిగి వెళ్తున్నది. ఈ క్రమంలో ర్యాలమడుగు సమీపంలో నిజాంపేట నుంచి వస్తున్న లారీ ఎదురుగా ఢీకొట్టింది. ఈ ఘటనలో బొలెరో డ్రైవర్ వాజీద్(35) అక్కడికక్కడే మృతిచెందాడు. బొలెరో వాహనం ముందు భాగం నుజ్జునుజ్జు కావడానికి తోడు డ్రైవర్ అందులోనే చిక్కుకుపోవడంతో పోలీసులు అర గంట శ్రమించి వాజీద్‌ను బయటకు తీశారు. ఖేడ్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు దాటుతుండగా..

నర్సాపూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతున్న వ్యక్తిని గుర్తు తెలియని లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్ఐ లింగం వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా దుండిగల్ గ్రామానికి చెందిన గడ్డమీద మహేష్(33) మంగళవారం నర్సాపూర్ మండలం రెడ్డిపల్లిలోని తన బంధువుల ఇంటికి వచ్చాడు. రాత్రి రెడ్డిపల్లి సమీపంలోని జాతీయ రహదారి క్రాస్ రోడ్డుపై రోడ్డు దాటుతుండగా నర్సాపూర్ నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో మహేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య శృతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

నర్సాపూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నర్సాపూర్ మండలం చిన్నచింతకుంటకు చెందిన బండ పోచయ్య(50) భార్య చనిపోగా.. గ్రామానికి చెందిన మరో మహిళతో సహజీవనం చేస్తున్నాడు. కుటుంబీకులతో ఉన్న కలహాలతో మనస్తాపం చెంది మంగళవారం రాత్రి 11 గంటలకు పురుగుల మందు తాగి అరుస్తుండగా కుటుంబీకులు నర్సాపూర్ ఆస్పత్రికి, అక్కడి నుంచి సంగారెడ్డి ఆస్పత్రికి తరలించగా.. బుధవారం మృతిచెందినట్లు ఎస్ఐ లింగం తెలిపారు.

రేకుల షెడ్డు పైనుంచి పడి వ్యక్తి మృతి

సంగారెడ్డి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందాడు. యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన నితీష్‌కుమార్(28) కొంతకాలంగా సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం బుదేరా చౌరస్తాలో గల పెట్రోల్ బంక్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. బంక్‌కు సంబంధించి చౌరస్తాలో సిమెంట్ రేకుల షెడ్డు ఉన్నది. రేకులు పగిలిపోవడంతో పరిశీలించేందుకు పైకి ఎక్కి జారిపడడంతో తలకు గాయమైంది. సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. బుధవారం మృతిచెందాడు. తండ్రి చంద్రమౌళి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేష్‌నాయక్ తెలిపారు.

గేట్ ఫలితాల్లో మాచాపూర్ యువకుడి సత్తా



చిన్నకోడూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్-2025) ఫలితాలు బుధవారం వెలువడ్డాయి. ఇందులో సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం మాచాపూర్‌కు చెందిన సింగిరెడ్డి నిర్మలాఆదిరెడ్డి దంపతుల కుమారుడు శ్రావణ్‌రెడ్డి సత్తా చాటారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో ఆల్ ఇండియా స్థాయిలో 807వ ర్యాంక్ సాధించాడు. శ్రావణ్ రెడ్డి చిన్ననాటి నుంచి ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే చదివినట్లు గ్రామస్థులు తెలిపారు.శ్రావణ్ రెడ్డిని పలువురు అభినందించారు.

ప్లానింగ్‌తో పరీక్ష రాద్దాం

టెన్త్ పరీక్షల కోసం నిపుణుల సలహాలు

సిద్దిపేట కల్చరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రేపటి నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలోనే పరీక్షలు ఏలా రాయాలి. ఏం చేస్తే మంచి మార్కులు స్కోర్ చేయవచ్చనే అంశాల గురించి విద్యా నిపుణులు నవీన్‌కుమార్, చేతిరాత నిపుణులు ఎజాజ్ అహ్మద్ సలహాలు, సూచనలు



జి. నవీన్ కుమార్, ఎడ్యుకేషన్ సైకాలజిస్టు



ఎజాజ్ అహ్మద్ చేతి రాత నిపుణులు

ఆత్మవిశ్వాసంతో రాసేద్దాం

- ఏడాది పొడవునా చదివారు. పరీక్ష హాల్లోకి ప్రవేశించే సమయంలో భయాన్ని వీడి కచ్చితంగా మంచి మార్కులు సాధించగలననే ఆత్మవిశ్వాసంతో వెళ్లాలి.
- పరీక్ష హాల్లో ఇన్విజిలేటర్ ఇచ్చే సూచనలను అర్థం చేసుకుని పాటించాలి. అర్థం కాకపోతే అడగాలి.
- ప్రశ్నాపత్రం పూర్తిగా చదివి అర్థం చేసుకున్నాకే సమాధానాలు రాయడం ప్రారంభించాలి. సమయం గురించి దిగులు చెందాల్సిన పనిలేదు.
- సమాధానాల కోసం ఇచ్చే బుక్‌లెట్‌లో ప్రతిపేజీకి ఎడమ వైపు రెండు సెంటీమీటర్ల మేర మార్జిన్ వదలాలి. అందులోనే ప్రశ్న సంఖ్య రాయాలి.
- ప్రశ్నాపత్రంలో బాగా వచ్చిన ఏ ప్రశ్నకైనా జవాబు రాయవచ్చు. ప్రశ్నల క్రమంతో సంబంధం లేదు. తెలిసిన ప్రశ్నలు రాసిన తర్వాతే, తెలియని ప్రశ్నలను ప్రయత్నించాలి.
- జవాబులను వీలైనంతవరకు పాయింట్స్ రూపంలో రాయటం మంచిది. ఎక్కువ మార్కులు పొందటానికి వీలుంటుంది. పాయింట్స్ సంఖ్యను మాత్రం మార్జిన్‌కు లోపలనే వేయాలి.
- ఒక ప్రశ్నకు జవాబు రాసిన తర్వాత మరో ప్రశ్నకు జవాబు రాసే మధ్యలో గీత కొట్టడం మంచిది.
- తప్పనిసరిగా రాయాల్సిన ప్రశ్నలు పూర్తయ్యాక అదనపు అదనపు (ఛాయిస్) ప్రశ్నలు రాయాలి. అలా రాసేటప్పుడు ఎక్స్‌ట్రా అని రాయకూడదు.
- బిట్ పేపర్, గ్రాఫ్‌పేపర్‌ను దారంతో కట్టడం మరిచిపోకూడదు.

అందంగా రాయాలి..

- సమాధానాలు రాసే సమయంలో చేతిరాత ఎంత అందంగా రాస్తే అంతా మంచి మార్కులు స్కోర్ చేసే అవకాశం ఉంటుంది.
- అక్షర దోషాలు, రాతలో గజిబిజి, కొట్టివేతలు ఉండకూడదు.
- సమాధాన పత్రంలో సమాధానాలు రాసేటప్పుడు ఎరుపు, పచ్చ ఇంకు పెన్నులు వాడరాదు. శీర్షికలను స్కెచ్ పెన్నులతో రాయవచ్చు. ఒక ప్రశ్నకు సమాధానం పూర్తయ్యాక పెన్సిల్‌తో గీత గీయవచ్చు. లేదంటే ఒక లైను వదిలి పెడితే సరిపోతుంది.
- పరీక్ష ప్రారంభంలో నెమ్మదిగా చివరి నిమిషాల్లో వేగంగా రాసి పరీక్షను ముగించవద్దు. ప్రశ్నపత్రంలో ఇచ్చిన ప్రశ్నల సంఖ్యకు రాసే సమాధానాల నిడివి ఆధారంగా సమయాన్ని విభజించుకుని సమాధానాలు రాయాలి.



- తెలుగులో అక్షరాలు సమానంగా గుండ్రంగా ఉండాలి. అచ్చుల గుర్తులు అన్నిచోట్ల సమానంగా ఉండాలి. తలకట్టు ఒకే ఆకారంలో అక్షరానికి సరిపోయే విధంగా ఇవ్వాలి. సున్నాలను అక్షరం సైజులోనే రాయాలి. ఒత్తులు చిన్నవిగా ఇవ్వాలి. వాక్యంలో పదాలకు మధ్య సరైన నిడివి ఉండాలి.
- ఫుల్ స్టాప్(చుక్క గుర్తు), కామా, బ్రాకెట్లు, ఆశ్చర్యార్థకాలు, ఇన్వర్టర్ కామాలు అవసరమైన చోట తప్పక రాయాలి.
- హిందీ సమాధానాలు రాసేటప్పుడు అక్షరాలు గుండ్రటి ఆకృతిని కలిగి ఉండాలి. నిలువుగీత కలిగిన అక్షరాలను సమానంగా ఒకే ఆకారం(సైజు)లో రాయాలి. ఎడమ వైపు గాని, కుడి వైపు గాని వంగినట్లు అక్షరాలను రాయవద్దు. పదాలు, లైన్లకు మధ్య విడివిలో సమానత్వం పాటించాలి.
- ఏ కీ మాత్ర(అచ్చుల గుర్తులు), ఐ కీ మాత్ర, ఔ కీ మాత్రలను మాత్రం ఎడమవైపు వాల్చుతూ సమానంగా రాయాలి. ఇ కీ మాత్ర, ఈ కీ మాత్ర అక్షరానికి గుడిశ మాదిరిగా, అదే ఈ క్రమంలో కుడి వైపు వాలినట్లు రాయాలి.
- ఆంగ్లంలో ఏ, సీ, ఈ, ఐ, ఎం, ఎన్, ఓ, ఆర్, ఎస్, యూ, వీ, డబ్ల్యూ, ఎక్స్ అక్షరాలు మధ్య భాగాన వచ్చేటట్లు రాయాలి. బీ, డీ, ఎఫ్, హెచ్, కే, ఎల్, టీ అక్షరాలు పైకి వెళ్లేలా రాయాలి. జీ, జే, పీ, క్యూ, వై, జడ్ అక్షరాలు కిందకు వచ్చేటట్లు రాయాలి. కర్సివ్ రైటింగ్ గాని, లూసిడా రైటింగ్ గానీ ఏదైనా రాయవచ్చు. అక్షరాలు వాలేటట్లు రాయగూడదు. క్యాపిటల్ లెటర్స్ (పెద్ద అక్షరాలు) పెద్ద సైజులో, స్మాల్ లెటర్స్ (చిన్న అక్షరాలు) చిన్న సైజులో రాయకూడదు.
- గణితంలో అంకెలు చక్కగా రాయగలగాలి. సున్న అంకె 0ను ం లా రాయవద్దు. సున్న అంకె0ను రాయడం బాగా ప్రాక్టీస్ చేయాలి. సున్న, సమానత్వం, లెస్ దాన్(తక్కువ), గ్రేటర్ దాన్(ఎక్కువ), ప్లస్(కూడిక), మైనస్ (తీసివేత), మల్టిప్లికేషన్ లేదా ఇంటు (గుణకారం), డివిజన్ (భాగహారం) గుర్తులు స్పష్టంగా రాయాలి.
- సైన్స్‌లో భాగమైన ప్రయోగాల పటాలు, బొమ్మలు బాగా వేయాలి. పెన్సిల్‌తో పటాలను. బొమ్మలను గీసి భాగాలను గుర్తించి వాటి పేర్లను పెన్నుతో రాయవచ్చు. పటాలు బొమ్మల భాగాలను గుర్తించి కుడి వైపున రాయాలి.
- సాంఘిక శాస్త్రం తెలుగు అక్షరాలను రాసేటప్పుడు పాటించే నియమాలు, ఆంగ్ల మాధ్యమంలో సమాధానాలు రాసేవారు ఆంగ్ల నియమాలు పాటిస్తూ సమాధానాలు రాయాలి.

వీటన్నంటితో పాటు ఆత్మవిశ్వాసంతో పరీక్ష రాస్తే విజయం మీదే..

నాచగిరి లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

వర్గల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో స్వామివారి నవాహ్నిక బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమైనాయి. శ్రీ క్షేత్రం పీఠాధిపతులు మధుసూదనానంద సరస్వతీ స్వామిజీ ఆలయ మండపంలో స్వామివారి వద్ద జ్యోతిప్రజ్వలన చేసి బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వేదికపై స్వామిజీ మాట్లాడుతూ నాచగిరి లక్ష్మీనృసింహుడి కృప కటాక్షాలచే ప్రజలందరు సంతోషంగా ఉండాలన్నారు. వేడుకల సందర్భంగా ఆలయంలో ఆలయ వేద పండితులు కృష్ణమాచార్యులు, గోపాలకృష్ణశర్మ, నాగరాజ శర్మ, హరి ప్రసాద్ శర్మ, జగన్నాథ శర్మల వేద మంత్రోశ్చరణల మధ్యన ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కారనిర్వహణాధికారి విశ్వనాథ శర్మ, ఆలయ అధికారులు సుధాకర్‌గౌడ్, నరేందర్, పాండు, మండల ఎంపీటీసీ ఫోరం మాజీ అధ్యక్షులు వెంకటేశ్‌గౌడ్‌తో పాటులతో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాలను ప్రారంభిస్తున్న మధుసూదనానంద సరస్వతీ స్వామిజీ



రాహుల్, సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నీలం మధు

బీసీ, ఎస్సీ బిల్లులు చరిత్రాత్మకం

కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఎన్నో సంవత్సరాలుగా నలుగుతున్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేలా బీసీలకు రాజకీయ, ఉద్యోగ, విద్య, ఆర్థిక రంగాలలో రిజర్వేషన్ల పెంపు బిల్లు, ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదింపజేయడం చారిత్రాత్మకమని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. బుధవారం చిట్కుల్ ఎన్ఎంఆర్ క్యాంప్ కార్యాలయంలో టీపీసీసీ పిలుపు మేరకు రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ అగ్రనేతలు, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్ చిత్రపటానికి కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఆయన క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ లోక్‌సభ విపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు అన్ని వర్గాలకు సమన్యాయం జరిగేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం ప్రజాపాలన కొనసాగిస్తుందన్నారు. మరోవైపు ఎస్సీ వర్గీకరణ పోరాటాన్ని ఆ వర్గ ప్రజల ఆకాంక్షలను గౌరవించి ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ఆమోదింపజేసి ఎన్నో ఏండ్ల కలను సాకారం చేశారని కొనియాడారు.

ఐదు రోజుల్లో అన్నాతమ్ముళ్లు మృతి

హుస్నాబాద్‌రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఐదు రోజుల వ్యవధిలో ఇద్దరు అన్నాతమ్ముళ్లు అనారోగ్యంతో మృతి చెందారు. మండలంలోని నాగారం గ్రామానికి చెందిన పొన్నాల ప్రభాకర్ (27)ఈనెల 14న జాండీస్(పసకలు)తో అనారోగ్యానికి గురై ఇంటి వద్ద మృతి చెందాడు. అతని సోదరుడు పొన్నాల రవి (33) జాండీస్‌కు గురి కావడంతో సిద్దిపేట ఆసుపత్రిలో చేర్పించారు. ఆస్పత్రిలో బుధవారం సాయంత్రం మృతి చెందాడు. పొన్నాల లింగయ్య-లచ్చవ్వల పెద్దకు మారుడైన రవి స్థానిక గ్రామ పంచాయతీలో తాత్కాలిక ఉద్యోగిగా పనిచేస్తుండగా, ప్రభాకర్ హుస్నాబాద్‌లోని ఓ పెట్రోల్ బంక్‌లో పనిచేస్తు తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇద్దరూ ఒకే వ్యాధితో, ఐదు రోజుల వ్యవధిలో చనిపోవడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. ఇద్దరు అన్నాదమ్ములకు భార్య, ఒక్కో కూతురు ఉన్నారు.

రసమయి ఫామ్‌హౌస్ ముట్టడికి కాంగ్రెస్ యత్నం

● బెజ్జంకి, గుండారంలో ఉద్రిక్తపరిస్థితి



బెజ్జంకిలో కాంగ్రెస్ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

బెజ్జంకి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఫాంహౌస్ ముట్టడికి కాంగ్రెస్ ఇచ్చిన పిలుపు ఉద్రిత్తంగా మారింది. రసమయి ఇటీవల నిర్వహించిన విలేకరుల సమావేశాల్లో ఎల్‌వోసీ, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ విషయంపై మాజీ ఎమ్మెల్యే బహిరంగ చర్చకు బెజ్జంకికి రావాలని కాంగ్రెస్ నాయకులు సవాల్ చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఫామ్‌హౌస్ ముట్టడికి కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. దీంతో సిద్దిపేట జిల్లా బెజ్జంకి, గుండారం గ్రామంలో ఉద్రికత్త పరిస్థితి నెలకొంది. ఫామ్ హౌస్ ముట్టడికి వెళ్లేందుకు యత్నించిన కాంగ్రెస్ నాయకులను పోలీసులు ఎక్కడికక్కడే అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. బెజ్జంకిలో భారీగా పోలీసులు మొహరించడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు బెజ్జంకి అంబేడ్కర్ కూడలిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నిరసన తెలిపారు. పదేళ్ల అధికారంలో ఉన్న రసమయి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడం విస్మరించి, రూ. కోట్లు సంపాదించుకుని ఫాంహౌస్‌లు కట్టుకున్నాడని ఆరోపించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని ఓ గ్రామంలో బాధిత కుటుంబానికి ఎల్‌వోసీపై కనీస పరిజ్ఞానం లేకుండా మాట్లాడరని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యేను బహిరంగ చర్చకు పిలిస్తే రాకపోవడం వల్లే ఫాంహౌస్ వద్దకు వెళ్తున్నామని అన్నారు.

అవినీతిని ప్రశ్నిస్తే దాడులకు దిగుతారా..

సీఎం రిలీఫ్ ఫండ్, ఏల్‌వోసీ చెక్కుల పంపిణీలో జరిగిన అవినీతి, అక్రమాలపై ప్రశ్నిస్తే ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తన అనుచరులతో దాడులకు దిగడం సరైంది కాదని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. తన ఫాంహౌస్ ముట్టడికి కాంగ్రెస్ నాయకులు ప్రయత్నించిన నేపథ్యంలో బాలకిషన్‌ను, బీఆర్ఎస్ నాయకులను పోలీసులు గృహ నిర్బందం చేశారు. ఈ సందర్భంగా ఆయన పత్రిక ప్రకటన విడుదల చేశారు. సీఎం రిలీఫ్ ఫండ్, ఏల్‌వోసీ చెక్కులను కాంగ్రెస్ నాయకులు కాజేశారని ఆధారాలతో నిరూపిస్తానని చెబితే అసహనానికి లోనైనా కవ్వంపల్లి అనుచరులు దాడికి యత్నించడం హేయమైన చర్య అని పేర్కోన్నారు. అవినీతి, అక్రమాలపై కాంగ్రెస్ నాయకులు చర్చకు వస్తే తాను ఎక్కడకు రమ్మన్నా ఆధారాలతో వస్తానని ఈ సందర్భంగా రసమయి సవాల్ విసిరారు.

బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు

బడ్జెట్ అన్ని వర్గాలకు ప్రయోజనం



సంగారెడ్డి టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూరుతుంది. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు ప్రాధాన్యతనిచ్చి ఒక్కొక్కటిగా అమలు చేస్తోంది. ప్రజలు నమ్మి కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టినందున ప్రజలకు జవాబు దారీగా ఉంటూ పాలన సాగిస్తున్నాం. గత ప్రభుత్వ పాలనలో చిద్రమైన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నాం. మహిళా సమాఖ్యల ద్వారా ఆర్టీసి అద్దెకు 600 బస్సులు కేటాయింపుతో వారికి పెద్దపీట వేసిన ప్రభుత్వం కాంగ్రెస్ ఒక్కటే.

- నిర్మలాజగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్

రాష్ట్ర బడ్జెట్ అంకెల గారడీ



సంగారెడ్డి అర్బన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్ అంకెల గారడీ తప్ప ఆరు గ్యారెంటీల ఊసేలేదు. కీలకమైన విద్య, వైద్య, వ్యవసాయ, సాగునీటి రంగాలకు కంటితుడుపుగా నిధులు కేటాయించారు. మహిళలకు ఇస్తామన్న రూ.2500 ఆర్థిక సాయం ఎప్పటి నుంచి ప్రారంభిస్తారో ప్రకటించలేదు. జిల్లాలో సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకానికి నిధులు ఇవ్వకపోవడం తీవ్ర అన్యాయం చేయడమే.

- గోదావరి అంజిరెడ్డి, బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు


విద్యకు అరకొర నిధులు



సిద్దిపేట కల్చరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో విద్యారంగానికి అరకొర నిధులు కేటాయించారు. విద్యకు గత సంవత్సరం రూ. 21,292 కోట్లు కేటాయిస్తే, ఈసారి 0.26 శాతం మాత్రమే నిధుల కేటాయింపు అధికంగా ఉంది. మొత్తం బడ్జెట్ రూ. 3,04,965 కోట్లలో విద్యకు రూ. 23,108 కోట్లు (7.57శాతం) నిధుల కేటాయింపు ప్రభుత్వ విద్యా సంస్థల అభివృద్ధికి ఏ మాత్రం సరిపోదన్నారు.

-జి. తిరుపతిరెడ్డి, టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు

ప్రజలను ముంచే బడ్జెట్



సంగారెడ్డి రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్ ప్రజలను ముంచే బడ్జెట్‌లా ఉంది. రాష్ట్ర బడ్జెట్ నిరాశగా ఉంది. ఈ ప్రభుత్వం గేమ్ చేంజర్ కాదు. నేమ్ చేంజర్ మాత్రమే. బడ్జెట్‌లో మహిళలకు ఇస్తామన్న రూ. 2500 ఊసేలేదు. అందాల పోటీకి మాత్రం రూ.250 కోట్లు పెట్టారు. రైతులకు ఇచ్చిన హామీలకు రూ. 42 కోట్లు అవసరమవుతాయి, బడ్జెట్‌ను చూస్తే రైతులను మరోసారి మోసం చేయబోతున్నారని స్పష్టం అయింది. కేవలం రూ.36 వేల కోట్లతో అభివృద్ధి ఎలా సాధ్యమో చెప్పాలి.

- చింతా ప్రభాకర్, సంగారెడ్డి ఎమ్మెల్యే

పేదల సంక్షేమానికి పెద్దపీట



గజ్వేల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్ పేద ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేసింది. అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం ఇచ్చారు. ఆరు గ్యారెంటీల అమలుకు నిధులు కేటాయించారు. యువత, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే యంగ్ ఇండియా, రెసిడెన్సియల్ పాఠశాలలకు రూ.2900 కోట్లను కేటాయించడం హర్షణీయం. అన్ని రంగాలకు నిధులు కేటాయించి సీఎం రేవంత్‌రెడ్డి తన చిత్తశుద్ధిని నిరూపించుకున్నారు.

- నర్సారెడ్డి, మాజీ ఎమ్మెల్యే గజ్వేల్

కాంగ్రెస్‌ది ప్రజాపాలన బడ్జెట్..



సిద్దిపేట టౌన్, మార్చి19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్ ప్రజాపాలన బడ్జెట్‌గా ఉంది. రైతులు, విద్య, గ్రామాల అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమం ఇలా అన్ని వర్గాల వారికి పెద్దపీట వేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అంకెల్లో గారడీ చేయడమే తప్ప రాష్ట్ర ప్రజలకు ఒరిగింది ఏమీ లేదు. కేసీఆర్ చేసిన అప్పులను చెల్లిస్తూ రాష్ట్ర అభివృద్ధికి పాటుపడుతున్న సీఎం రేవంత్‌రెడ్డికి ప్రజలందరూ రుణపడి ఉండాలి.

-అత్తుఇమామ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు

మల్లన్నసాగర్ కాలువలో చనిపోయిన కోళ్లు

దుబ్బాక, మార్చి19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరేంగగడ్డ నుంచి పారే మల్లన్నసాగర్ 4ఎల్ కాలువలో చనిపోయిన కోళ్ల వ్యర్థాలను పారేస్తున్నారని ఆగ్రామ కార్యదర్శి రాములు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాలువతో పాటు బహిరంగ ప్రదేశాలల్లో కూడా చనిపోయిన కోళ్లను పారేస్తున్నారనీ, ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని అన్నారు. గ్రామ మధ్యలో కోళ్ల ఫారాలు ఉండగా, గతంలో నోటీసులు ఇచ్చామని తెలిపారు. దుబ్బాక పట్టణంలోని ఏదుల్ల చెరువులో కూడా చనిపోయిన కోళ్లను, కోళ్ల వ్యర్థాలను పారేస్తున్నారనీ దుబ్బాక గ్రామ రైతాంగం ఆందోళన వ్యక్తం చేస్తుంది.



వడ దెబ్బకు నాటు కోళ్ల మృతి

చిలప్‌చెడ్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): వడదెబ్బకు నాటు కోళ్ల మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలోని అమృత ఫాంలో బుధవారం చోటు చేసుకుంది. ఫాం యజమాని శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీనివాస్ నాటుకోళ్ల ఫాంతో జీవనోపాధి పొందుతున్నాడు. బుధవారం ఒకేసారిగా 30 కోళ్ల మృత్యువాత పడ్డాయి. దీంతో బాధితుడు స్థానిక వెటర్నరీ అధికారి వినోద్‌కు సమాచారం చేరవేశాడు. అక్కడి చేరుకుని పరిశీలించిన ఆయన వడ దెబ్బ, అజీర్ణం కారణంగా మృతి చెందినట్లు తెలిపారు.

మున్సిపల్ జియో మ్యాపింగ్‌కు సర్వే ఆఫ్ ఇండియా అధికారులు



హుస్నాబాద్‌లో సర్వే చేస్తున్న అధికారులు

హుస్నాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మున్సిపాలిటీ జియో మ్యాపింగ్‌ను తయారు చేసేందుకు బుధవారం సర్వే ఆఫ్ ఇండియా అధికారులు వచ్చారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నక్ష ప్రాజెక్టులో భాగంగా రాష్ట్రంలో ఎంపిక చేసిన 10 మున్సిపాలిటీల్లో హుస్నాబాద్ మున్సిపల్ కూడా ఉన్నట్టు కమిషనర్ మల్లిఖార్జున్ తెలిపారు. అందులో భాగంగా ఈ సర్వే నిర్వహిస్తున్నారన్నారు. గత నెల క్రితం హెలిక్యాప్టర్‌తో ఏరియల్ సర్వే చేశారని, ఈ సర్వేతో పట్టణ సరిహద్దులు, ల్యాండ్ రికార్డులు, పట్టణ అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేసుకోవడానికి, పట్టణ మౌళిక సదుపాయాల అభివృద్ధి చేసుకోవడానికి ఈ నక్ష ప్రాజెక్టు ఉపయోగపడుతుందన్నారు.

పేదోడి ఫ్రిజ్‌కు భలే గిరాకీ

● మట్టితో తయారైన కుండలు, బాటిళ్లు, ఇతర మట్టిపాత్రలకు పెరిగిన డిమాండ్



మట్టికుండల కొనుగోలు కోసం బేరమాడుతున్న దృశ్యం

అక్కన్నపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గత పది రోజుల నుంచి భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ఉదయం 10 గంటలకే ఎండలు మండిపోవడంతో ప్రజలు ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రెండురోజుల క్రితమే ఎండ తీవ్రత 42డిగ్రీల పైన నమోదు కావడంతో ప్రజలు బయటికి రావాలంటే జంకుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయట పనులుంటే ప్రజలు చెరుకు రసం, శీతల పానీయాలను సేవిస్తూ పనులు పూర్తి చేసుకోవడంతో ఆయా షాపులకు గిరాకీ పెరిగింది.

ఊపందుకున్న రంజన్‌ల విక్రయాలు

ఫ్రిజ్‌లు కొనుక్కునే స్తోమత లేనివారు, ఫ్రిజ్ ఉన్నా వాటిలోని నీరు తాగని వారికోసం రంజన్‌లు మార్కెట్‌లోకి వచ్చేశాయి. ఎండాకాలం రావడంతోనే హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల్లో రంజన్‌ల కొనుగోలు ప్రారంభమైంది. ప్రధాన రోడ్లపై ఎక్కడా చూసినా వివిధ రకాల కుండలు, రంజన్‌ల విక్రయాలు ఊపందుకున్నాయి. ఫ్రిజ్ నీటి కన్నా రంజన్ నీరు ఆరోగ్యానికి ఎంతో మేలనే విషయం అందరికీ తెలిసిన విషయమే. ఆరోగ్య ప్రియులు కూడా మట్టి కుండల్లోని చల్లని నీటిని తాగడానికి ఇష్టపడడంతో రంజన్‌లకు గిరాకీ విపరీతంగా పెరిగింది. ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి మట్టి కుండలే శ్రేష్ఠమని ఆరోగ్యనిపుణులు చెబుతున్నారు. ఫ్రిజ్ నీళ్లు తాగడంతో అనారోగ్య సమస్యలు వస్తాయని, రోగాలబారిన పడకుండా రంజన్‌లనే వాడేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు.



అక్కన్నపేటలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న రంజన్‌లు

సైజును బట్టి ధర

ఒక్కో రంజన్ సైజును బట్టి రూ.150 నుంచి రూ.350 వరకు అమ్ముతున్నట్టు విక్రయదారులు తెలిపారు. కాగా మట్టితో తయారుచేసి బాటిళ్లను సైతం ఎంతోమంది కొనుగోలు చేస్తున్నారని వారు చెబుతున్నారు. మట్టిపాత్రలు, వివిధసైజులలో కుండలకు వేసవిలో మంచి గిరాకీ ఉంటుందని అమ్మకందారులు వివరించారు. దీంతో పేదవాడి ఫ్రిజ్‌గా ఆదరణ పొందిన రంజన్‌లు, మట్టికుండలకు, ఇతర మట్టి తయారీ పాత్రలకు డిమాండ్ బాగా పెరిగింది. చల్లని నీటి కోసమే కాకుండా ఆరోగ్యం దృష్ట్యా పేద, ధనిక తేడా లేకుండా ప్రజలు వీటిని కొనుగోలు చేయడం గమనార్హం.

బైక్‌పై వెళ్తూ గుండెపోటుతో వ్యక్తి మృతి



మృతి చెందిన నరేష్

జగదేవ్‌పూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బైక్‌పై వెళ్తుండగా గుండెపోటుతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని మునిగడప గ్రామ సమీపంలో బుధవారం రాత్రి జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా రామన్నపేట గ్రామానికి చెందిన నరేష్(38) అనే యువకుడు ఉపాధి కోసం హైదరాబాద్‌లోని వినాయకనగర్‌లో భార్య పిల్లలతో కలిసి ఉంటున్నాడు. కాగా బుధవారం స్వగ్రామం నుంచి బియ్యం బస్తా బైక్‌పై వేసుకొని బయలుదేరాడు. రాత్రి 9 గంటల ప్రాంతంలో జగదేవ్‌పూర్ మండలంలో మునిగడప గ్రామ సమీపంలోకి రాగానే చాతిలో నొప్పి రావడంతో బైక్‌పై నుంచి కిందకు దిగి నొప్పి భరించలేక కింద పడిపోయాడు. చుట్టుపక్కల వారు వచ్చి చూడగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. నరేష్ మృతి విషయం కుటుంబ సభ్యులకు తెలియజేసినట్లు ఎస్ఐ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 8 మందికి జరిమానా

● ఒకరికి 3 రోజుల జైలు

సిద్దిపేట క్రైం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఇటీవల సిద్దిపేట పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో డ్రంకెన్ నిర్వహించగా 8 మంది పట్టుబడ్డారు. నిందితులను బుధవారం సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ఎదుట కోర్టులో హాజరుపరచగా విచారణ అనంతరం వారికి రూ.12 వేల జరిమానా విధించారు. వారిలో ఒకరికి జరిమానాతో పాటు 3 రోజులపాటు జైలు శిక్ష విధించారు.

విద్యార్థి దశలో పదోతరగతి కీలకం



కస్తూర్బాలోని కిచెన్‌లో పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్

చేర్యాల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో పదో తరగతి అత్యంత కీలకమని, అందుకోసం ప్రణాళికాబద్ధంగా ముందడుగు వేసి విజయం సాధించాలని సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్ సూచించారు. తాము చదువుకున్న పాఠశాలకు కలెక్టర్ హోదాలో సందర్శించే విధంగా విద్యార్థులు ఎదగాలని తాను కోరుకుంటున్నానని అదనపు కలెక్టర్ ఆకాంక్షించారు. బుధవారం చేర్యాల పట్టణంలోని కస్తూర్బా పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పదవతరగతి విద్యార్థులకు కాసేపు పాఠాలు బోధించారు. కిచెన్ రూంను సందర్శించి భోజన తయారీ, నీటి వసతి, కూరగాయలు పరిశీలించారు. భోజనం మెనూ పాటించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కురుమవీధి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీకేంద్రాన్ని పరిశీలించారు. పోషకాహార సరుకుల నిల్వ, రిజిష్టర్లను పరిశీలించారు. బాలామృతం పంపిణీపై లబ్ధిదారురాలితో మాట్లాడి ఆరా తీసింది. గత నెలలో స్టాకు రాలేదని తెలపడంతో వివరాలను నమోదుచేసుకున్నారు. అలాగే చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేసి డ్యూటీ డాక్టర్ల వివరాలు, ఓపీ సంఖ్య, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగుల వివరాలను పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.

రేపు జిల్లా స్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ ఫెస్టివల్

సిద్దిపేట కల్చరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ యువజన సర్వీసులు క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నేషనల్ యూత్ పార్లమెంట్ ఫెస్టివల్ జిల్లా స్థాయి కార్యక్రమం గురువారం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరగనుంది. వికసిత్ భారత్ గురించి యువత ఏమనుకుంటున్నారు అనే విషయాన్ని వన్ మినిట్ వీడియో ద్వారా మై భారత్ పోర్టల్‌లో యువత అప్‌లోడ్ చేశారు. ఈ కార్యక్రమానికి నోడల్ జిల్లా యువత నుంచి విశేష స్పందన వచ్చింది. 754మంది యువత తమ స్పందనలను తెలియజేసింది. ఇందులో నుంచి 150 మందిని స్క్రూట్నీ కమిటీ ఎంపిక చేసింది. వీరు సిద్దిపేట నోడల్ జిల్లా పరిధిలో జరిగే భారత్ నేషనల్ యూత్ పార్లమెంట్ డిస్ట్రిక్ లెవెల్ రౌండ్‌లో పాల్గొంటారు. ఇందులో నుంచి 10 మందిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారు. వీడియో అప్లోడింగ్ విషయంలో దేశంలోనే సిద్దిపేట నోడల్ జిల్లా మంచి స్థానంలో ఉందని, రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉందని జిల్లా నోడల్ అధికారి డాక్టర్ జి సునీత తెలిపారు. ఈ కార్యక్రమానికి పౌరులను, మీడియా సిబ్బందిని అందరినీ ఆహ్వానిస్తున్నామని వికసిత్ భారత్ జిల్లా కోఆర్డినేటర్ డా ఎం. శ్రద్ధానందం తెలిపారు.

ఎమ్మార్వో కార్యాలయంలో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లకు నో ఛాన్స్

సిద్దిపేట అర్బన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకొని నెలలు గడుస్తున్నా సర్టిఫికెట్లు చేతికి అందలేదని సిద్దిపేట పట్టణం అర్బన్ మండలం, రూరల్ మండలానికి చెందిన పలువురు బాధితులు వాపోయారు. ఈ విషయమై సంబంధిత సిద్దిపేట తహసీల్దార్ కార్యాలయంలో అధికారులను వివరణ కోరగా ఫ్యామిలీ మెంబర్ ఆన్‌లైన్ సర్టిఫికెట్ ఎమ్మార్వో కార్యాలయం నుంచి అందించబడదని పేర్కొన్నారు. ఈ మధ్యకాలంలోనే కరీంనగర్ జిల్లాలో తహసీల్దార్ కార్యాలయంలో ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్ల విషయంలో సంబంధిత ఆర్ఐ, ఎమ్మార్వోపై ఫిర్యాదులు అందడంతో ఇటీవల కాలంలో ఆన్‌లైన్‌లో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లను ఎమ్మార్వో కార్యాలయం నుంచి ఇవ్వడాన్ని రద్దు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఆన్‌లైన్‌కు సంబంధించి పూర్తిస్థాయిలో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కావాలంటే కోర్టు ద్వారా తీసుకోవాలని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. స్థలాల రిజిస్ట్రేషన్ కు సంబంధించి తమ కార్యాలయ పరిధిలో ఉంటే సంబంధిత అధికారులే గ్రామాలకు వచ్చి విచారణ జరిపి రిజిస్ట్రేషన్ చేస్తారని అటువంటి వాటికి ఫ్యామిలీ మెంబర్ కూడా అవసరం ఉండకపోవచ్చని చెబుతున్నారు. ఇంకా ఏదైనా ఇతర విషయాలలో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ అవసరం ఉంటే అట్టి విషయాన్ని సర్టిఫికెట్ పై ప్రస్తావిస్తూ మాన్యువల్‌గా ఇస్తామని రెవెన్యూ అధికారులు వివరించారు. అయితే మాన్యువల్ గా సర్టిఫికెట్ జారీ చేయడంలో జాప్యం ఏమీ జరగడం లేదని తెలిపారు. పూర్తిస్థాయిలో ఈ విషయంపై అవగాహన లేక బాధితులు సర్టిఫికెట్ కోసం ఎమ్మార్వో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.

నాణ్యమైన సేవలను అందించాలి

గజ్వేల్: ప్రజలకు నాణ్యమైన సేవలను అందజేయాలని సిద్దిపేట జిల్లా ఈడీఎం(ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్) ఆనంద్ సూచించారు. గజ్వేల్‌లోని పలు మీసేవా కేంద్రాలను బుధవారం సాయంత్రం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.

బాధ్యతల స్వీకరణ

హుస్నాబాద్: హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్ డిపో నుంచి బదిలీపై వచ్చిన ఎస్ వెంకన్న బుధవారం హుస్నాబాద్ ఆర్టీసీ డిపో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన వెంకటేశ్వర్లు కాచిగూడ డిపోకు బదిలీ అయ్యారు.

ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు పూర్తి

సిద్దిపేట కల్చరల్: ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు బుధవారం పూర్తయ్యాయి. చివరి రోజు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డీఐఈవో రవీందర్ రెడ్డి తెలిపారు. 96 శాతం హాజరు నమోదైనట్టు తెలిపారు.

పాఠశాలలో గురువందనం

సిద్దిపేట కల్చరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి విద్యార్థుల ఆత్మీయ వీడ్కోలు సందర్భంగా గురువందనం కార్యక్రమం నిర్వహించారు. తల్లిదండ్రులకు పదోతరగతి విద్యార్థులు పాదపూజ చేసి వారి ఆశీస్సులు అందుకున్నారు.

వారసులకు ఉద్యోగాలివ్వాలి

సిద్దిపేట కలెక్టరేట్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలను ఇచ్చి వెంటనే విధుల్లోకి తీసుకోవాలని 61 సంవత్సరాల పైబడిన వీఆర్ఏల జిల్లా అధ్యక్షుడు గుడుమల్ల రాజులింగం అన్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ మను చౌదరికి వినతి పత్రం అందించారు.

రాష్ట్రస్థాయి 'జిజ్ఞాస'లో విజయకేతనం



బహుమతులు గెలుచుకున్న పరిశోధక విద్యార్థులు

సిద్దిపేట కల్చరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జిజ్ఞాస రాష్ట్రస్థాయిలో సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సంబంధించిన నాలుగు ప్రాజెక్ట్‌లకు బహుమతులు వరించాయి. కళాశాల విద్యాశాఖ కమిషనర్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో మైక్రో బయాలజీ, తెలుగు, ఇంగ్లిష్, హిస్టరీ సబ్జెక్ట్‌లకు సంబంధించిన ప్రాజెక్టులకు బహుమతులు వచ్చాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. సునీత ఒక ప్రకటనలో తెలియజేశారు. మైక్రో బయాలజీ విభాగంలో డాక్టర్ జి.మదన్మోహన్ పర్యవేక్షణలో 'టూత్ బ్రష్‌ల పరిశుభ్రత, సూక్ష్మజీవుల వ్యాప్తి' పరిశోధనకు ప్రథమ బహుమతి దక్కింది. డాక్టర్ మట్ట సంపత్‌కుమార్ రెడి (తెలుగు విభాగం) పర్యవేక్షణలో 'వరకవి సిద్ధప్ప తాత్వికత, భజన మండళ్ల సేవ' అనే పరిశోధనకు ద్వితీయ బహుమతి వచ్చింది. జి.బాలకిషన్ (ఆంగ్ల విభాగం) పర్యవేక్షణలో 'ఆంగ్లభాష అధ్యయనంలో కృత్రిమ మేదస్సు పాత్ర'కు ద్వితీయ బహుమతి వచ్చింది. చరిత్ర విభాగంలో డాక్టర్ ఎం. కొండల్ రెడ్డి పర్యవేక్షణలో 'సిద్దిపేట జిల్లా హస్తకళలు, గొల్లభామ చీరల ప్రత్యేక అధ్యయనం'కు తృతీయ బహుమతి వచ్చిందన్నారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి. అయోధ్యరెడ్డి, డాక్టర్ గోపాల సుదర్శనం, డాక్టర్ సి.హెచ్ మధుసూదన్, డాక్టర్ ఉమామహేశ్వరి, పిట్ల దాసు, ఎం శ్రద్ధానందం విద్యార్థులను అభినందించారు.

'హామీలు అమలు చేయని ప్రభుత్వం'

హుస్నాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలం వెల్లదీస్తున్నదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ అన్నారు. బుధవారం ఆయన హుస్నాబాద్ పట్టణంలో జరిగిన నియోజకవర్గ బీజేపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జరగడం లేదని, కేంద్రం ద్వారా వచ్చిన నిధులను తామే ఇప్పించామని మంత్రి పొన్నం ప్రభాకర్ గొప్పలు చెప్పుకుంటున్నాడని ఆరోపించారు. ఇచ్చిన హామీ మేరకు హుస్నాబాద్‌ను కరీంనగర్‌లో కలపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక సాధికారతతోనే సమాజ అభివృద్ధి



మాట్లాడుతున్న ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు ఉప్పల శారద

దౌల్తాబాద్ మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థిక సాధికారతతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు ఉప్పల శారద అన్నారు. బుధవారం దౌల్తాబాద్ మండల కేంద్రంలోని వీఆర్‌ఆర్ గార్డెన్‌లో జిల్లా ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం అధ్యక్షురాలు పబ్బ మాధవి అశోక్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన ఆర్యవైశ్య మహాసభ మహిళలకు ముగ్గుల పోటీలు, ఆటలు పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేసి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి నల్లమల్లి సామ్రాజ్య లక్ష్మి, ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కంచం సుష్మ, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి గంప శ్రీనివాస్, ఆర్యవైశ్య మహాసభ మండల అధ్యక్షుడు గంప రవి, నాయకులు మదం శెట్టి ఉమాదేవి పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాం: నర్సారెడ్డి

గజ్వేల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ మండల పరిధిలోని శ్రీగిరిపల్లి గ్రామంలోని ముదిరాజ్ వీధిలో నిర్మించతలపెట్టిన సీసీ రోడ్డు పనులను ఆయన బుధవారం ప్రారంభించారు. ఆయన వెంట గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, నాయకులు నెంటూరు కుమార్, చిమ్మిరెడ్డి, అమరేందర్‌రెడ్డి, ప్రజ్ఞాపూర్ నర్సింలు, చేబర్తి వెంకటేశ్, చిన్న మల్లేశ్, పెద్దోళ్ల బాలయ్య, పెద్దోళ్ల నర్సింలు ఉన్నారు.

ఆరు గ్యారంటీలు.. 13హామీల ఊసే లేదు

● బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో గత ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 13 హామీల ఊసే లేదని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ అంతా అంకెల గారడీ అన్నారు. రైతులకు రుణమాఫీ 50శాతం మించి జరుగలేదని, కౌలు రైతులకు, ఆటో కార్మికులకు, రైతు కూలీలకు రూ.12వేల ప్రస్తావన లేదని మండిపడ్డారు. ఇది రైతు, నిరుద్యోగ, విద్యార్థి, నేతన్నల, కార్మిక వర్గాల వ్యతిరేక బడ్జెట్ అని పేర్కొన్నారు.

చిన్నారులకు అండగా ఉంటాం

తొగుట, మార్చి 19(ఆంధ్రజ్యోతి): తొగుట మండలం ఎల్లారెడ్డిపేట గ్రామంలో తల్లిదండ్రుల ఆత్మహత్యతో అనాథలుగా మారిన చిన్నారులకు అండగా ఉంటామని తొగుట కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ హరికృష్ణరెడ్డి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రాంరెడ్డి పేర్కొన్నారు. బుధవారం బాధిత కుటుంబాన్ని వారు పరామర్శించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ హరికృష్ణరెడ్డి రూ.10 వేలు, మండల పార్టీ అధ్యక్షుడు రాంరెడ్డి 5వేలు, ఎల్లారెడ్డిపేట మాజీ ఎంపీటీసీ వేల్పుల స్వామి రూ.5 వేలు, తొగుట మాజీ సర్పంచ్ పాగాల కొండల్‌రెడ్డి రూ.5వేలు, సిద్దిపేటకు చెందిన వీఎల్ఆర్ కన్‌స్ట్రక్షన్ వారు రూ.3 వేలు ఆర్థిక సాయాన్ని చిన్నారులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వెంకట్‌గౌడ్, కుమార్, ప్రభాకర్‌రెడ్డి, కిషన్, రాకేశ్, స్వామిగౌడ్ పాల్గొన్నారు.

రేణుకాఎల్లమ్మకు బోనాలు



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

సిద్దిపేట కల్చరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కేంద్రంలోని రేణుకానగర్‌లో కొలువైన శ్రీమహా రేణుకాఎల్లమ్మదేవి ఆలయ 49వ వార్షిక వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. గీతా పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో మూడు రోజులపాటు సాగే ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధవారం అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. సిద్దిపేటకు చెందిన గౌడ కులస్థులు అమ్మవారికి బోనాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రాణాలు పోయినా భూములు ఇవ్వం



చౌటపల్లి గ్రామసభలో నిరసన తెలుపుతున్న రైతులు

అక్కన్నపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఇండస్ట్రియల్ పార్కు నిర్మాణానికి ప్రాణాలు పోయినా మా భూములు ఇవ్వబోమంటూ రైతులు స్పష్టం చేశారు. బుధవారం మండలంలోని చౌటపల్లిలో ఇండస్ట్రియల్ పార్కు నిర్మాణానికి అవసరమైన భూములను సేకరించేందుకు అధికారులు గ్రామసభ నిర్వహించారు. తమ భూముల్లో ఇండస్ట్రియల్ పార్కు నిర్మించవద్దని, భూములు ఇవ్వబోమని రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వేనెంబర్ 312లో 150 కుటుంబాలకు గతంలోని ప్రభుత్వం పట్టాలు మంజూరు యగా, తాము సాగు చేసుకుంటూ జీవిస్తున్నామన్నారు. ఈ స్థలంలో ఇండస్ట్రియల్ పార్కు నిర్మిస్తే 150 కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి నెలకొంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆర్డీవో రామ్మూర్తికి లిఖితపూర్వకంగా రాసి రైతులు వినతిపత్రాలను సమర్పించారు. కాగా ఇండస్ట్రియల్ పార్కు నిర్మాణానికి రైతులు సహకరించాలని ఆర్డీవో రామ్మూర్తి కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలుష్య రహిత పరిశ్రమలు ఏర్పాటు చేసే విధంగా ఇండస్ట్రియల్ పార్కులో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. పార్కు నిర్మాణానికి భూములు ఇచ్చే రైతులకు మార్కెట్ ధర కంటే మూడింతలు చెల్లిస్తామన్నారు. మరోసారి గ్రామసభ ఏర్పాటు చేసి, రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్తామన్నారు. కార్యక్రమంలో ఏసీపీ సతీష్, తహసీల్దార్ విజయ్ భాస్కర్ తదితరులు ఉన్నారు.

సృజనాత్మకతను వెలికి తీసేందుకే సాంకేతిక శిక్షణ

నంగునూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి సాంకేతిక శిక్షణ పోటీలు ఎంతో దోహదపడతాయని రాజగోపాలపేట పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ గోవర్ధన్ పేర్కొన్నారు. మండలంలోని రాజగోపాలపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన ఈసీఈ బ్రాంచ్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో నిర్వహించిన సాంకేతిక శిక్షణ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచారని తెలిపారు. హైదరాబాద్‌లోని యూసుఫ్ గూడా దుర్గాబాయి దేశ్ముఖ్ ప్రభుత్వం మహిళా సాంకేతిక శిక్షణ కళాశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సృజన టెక్ ఫేస్టు 2025లో కళాశాల విద్యార్థుల బృందం, అధ్యాపకుడు రాజమౌళి పర్యవేక్షణలో రూపొందించిన ఆవిష్కరణకు బహుమతి రావడం అభినందనీయమన్నారు.

కాంగ్రెస్‌తోనే సబ్బండవర్గాలకు మేలు

చిన్నకోడూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీతోనే సబ్బండా వర్గాలకు మేలు చేకూరుతుందని కాంగ్రెస్ నాయకులు మీసం మహేందర్ యాదవ్ పేర్కొన్నారు. బీసీ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి అమోదం పొందేందుకు కృషి చేసినందుకు బుధవారం చిన్నకోడూరులో సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రులకు బీసీల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లుపై హర్షాతిరేకాలు



మర్కుక్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, మందకృష్ణ ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేస్తున్న మాదిగ జేఏసీ మండల కన్వీనర్ మొుండి భిక్షపతి

దుబ్బాక/మర్కుక్/ములుగు/జగదేవ్‌పూర్/మద్దూరు/నంగునూరు/దౌల్తాబాద్, మార్చి19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కల్పిస్తూ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయడం పట్ల జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆయా మండలాల్లో మందకృష్ణ, రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. దుబ్బాకలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి ముక్కపల్లి రాజు మాదిగ ఆధ్వర్యంలో నాయకులు బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలను వేసి మందకృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టపాసులను పేల్చి మిఠాయిలను పంచుకుని సంబురాలను నిర్వహించారు. మాదిగల చిరకాల స్వప్నం మాదిగ ఉపకులాలకు వర్గీకరణ సాధించిన ఘనత మందకృష్ణ మాదిగకే దక్కుతుందని మాదిగ జేఏసీ మండల అధ్యక్షుడు మొుండి భిక్షపతి అన్నారు. మర్కుక్‌లో మంద కృష్ణ మాదిగ, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ములుగు మండల కేంద్రంలోని మండల ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఆదాస్ మహేష్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ ఆమోద బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టడం శుభ పరిణామం అని పేర్కొన్నారు. జగదేవ్‌పూర్ మండల కేంద్రంలో మాదిగ జేఏసీ మండల అధ్యక్షుడు మాసపాక యాదగిరి ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మద్దూరు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి, చేర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ కామిడి జీవన్ రెడ్డి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందని పేర్కొన్నారు. నంగునూరులో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం స్థానిక అంబేడ్కర్, బాబు జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. సీఎం రేవంత్ రెడ్డి ,మంత్రులు దామోదర్ రాజనర్సింహ ,మంత్రివర్గ ఉప సంఘానికి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దౌల్తాబాద్ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు దేవిగారి స్వామి ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

దరిచేరని భృతి

(5వ పేజీ తరువాయి)

బెనిఫిట్స్ యాజమాన్యాలు అందించడంలేదు. దీనికి తోడు కేంద్రప్రభుత్వం 18 శాతం జీఎస్టీని విధించడంతో దేశం మొత్తంలో బీడీపరిశ్రమ కుదేలైంది. మరోవైపు బీడీ స్మోకర్స్ కూడా సిగరేటు వైపు ఆకర్షితులు కావడంతో క్రమంగా బీడీ పరిశ్రమలను మూసివేస్తామనే ధోరణిలో సంస్థల యాజమాన్యాలు కార్మికుల పనిదినాలను తగ్గించుకుంటూ వచ్చాయి. ఈ తరుణంలో పొమ్మనలేక పొగ పెట్టేందుకు యాజమాన్యాలు తంబాకులో కోతవిధించడం, నాణ్యతలేని ఆకును అందించడంతో కార్మికులు నష్టపోతున్నారు. ఐతే గత ఉప ఎన్నికల్లో కటాఫ్‌తేదీని ఎత్తేస్తామని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం, అధికారంలోకి వస్తే ఎత్తేస్తామని ఇటు కాంగ్రెస్ హామీలిచ్చినా అమలుకు నోచుకోవడం లేదు. కొత్త ప్రభుత్వం వచ్చి 14 నెలలు దాటినా ఇప్పటివరకు కటాఫ్ తేదీని ఎత్తేయలేదని, ఇప్పటికైనా స్పందించి 2014 తరువాతి కార్మికులకు జీవన భృతి అందేలా చర్యలు తీసుకోవాలని బీడీ కార్మికులు కోరుతున్నారు.

దివ్యాంగ పిల్లల విద్యాభివృద్ధికి భవిత సెంటర్లు



దివ్యాంగ విద్యార్థికి బ్రెయిలీ కిట్ అందజేస్తున్న దృశ్యం

మద్దూరు, మార్చి 19 : దివ్యాంగ పిల్లల విద్యాభివృద్ధికి ప్రభుత్వం మండలానికో భవిత సెంటర్లను ఏర్పాటు చేసిందని వీటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సెక్టోరియల్ అధికారి రంగనాథ్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని భవిత సెంటర్‌లోలో హెచ్ఎం చంద్రశేఖర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన దివ్యాంగ పిల్లల విద్య అనే అంశంపై నిర్వహించిన సదస్సులో తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. భవిత సెంటర్‌కు వచ్చే పిల్లలకు ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్‌తో పాటు పాఠశాలలకు వెళ్లే పిల్లలకు ఎస్కార్ట్ అలవెన్స్, స్కాలర్‌షిప్, రీడర్ అలవెన్స్ అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఫియోథెరపి క్యాంపు ఏర్పాటు చేస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో వరదరాజు, ఇంచార్జీ హెచ్ఎంలు సర్వర్, మజార్, ఫిజియోథెరపి ప్రియాంక్, పీఆర్టీయూమండల అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, దివ్యాంగ పిల్లలు పాల్గొన్నారు.